క్లుప్తంగా

ఏఎస్‌ఐకి ఘన సన్మానం



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

తలుపుల : ఏఎస్‌ఐ కృష్ణారెడ్డి పదోన్నతిపై బదిలీ అయిన సందర్భంగా ఆయన్ను సోమవారం ఎస్‌ఐ నరసింహుడు, పోలీసు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఏఎస్‌ఐ కృష్ణారెడ్డి నిబద్ధతతో విధులు నిర్వర్తించి మన్ననలు అందుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మస్తాన్, పోలీసులు ఈశ్వర్ నాయక్, తిరుమలేశ్ పాల్గొన్నారు.

తేరు తయారీకి వితరణ



తేరు తయారీ కోసం చెక్కు ఇస్తున్న దాతలు

అమడగూరు: మండలంలో ప్రసిద్ధి గాంచిన చౌడేశ్వరి అమ్మవారి నూతన తేరు (రథం) తయారీ కోసం గంగిరెడ్డిపల్లికి చెందిన డేగాని నారాయణరెడ్డి జ్ఞాపకార్థం కుమారులు మారపరెడ్డి, శేఖర్‌రెడ్డి, జయరామిరెడ్డి రూ.2.25 లక్షలను వితరణ చేశారు. సోమవారం ఆలయానికి చేరుకున్న వారు ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమరెడ్డికి పై మొత్తానికి సంబంధించి చెక్కును అందజేశారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందని దాతలు తెలిపారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సురేంద్ర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మంజునాథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

ఓడీచెరువు: కొండకమర్ల రైతు సేవ కేంద్రంలో సోమవారం రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. డీఆర్‌సీ వ్యవసాయ అధికారి చైతన్య, మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్ అహమ్మద్, డాట్ కోఆర్డినేటర్ రామసుబ్బయ్య మొక్కజొన్న, వరి, వేరుశనగ పంటలను ఆశించే తెగులు, వాటి నివారణ చర్యలు, ఎరువులు ఎంతెంత మోతాదులో వాడాలో అవగాహన కల్పించారు.

గోదాదేవి జయంతి



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆండాల్ తిరునక్షత్రం (గోదాదేవి) జయంతి వేడుకలను సోమవారం అర్చకులు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుని విగ్రహాలతో తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జోన్-6 దేశాల పతాకాలతో భక్తుల ప్రదర్శన

ప్రశాంతి నిలయం: సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్‌కు చెందిన జోన్-6 దేశాలైన యునైటెడ్ కింగ్‌డమ్, ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్, నార్వే, ఐర్లాండ్, నెదర్లాండ్ భక్తులు సోమవారం పుట్టపర్తికి విచ్చేశారు. సాయంత్రం ప్రశాంతి నిలయం సాయికుల్వంత్ సభా మందిరంలో వారి దేశాల పతాకాలతో ప్రదర్శనగా సత్యసాయి మహాసమాధిచెంతకు చేరుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. సత్యసాయిని కీర్తిస్తూ నిర్వహించిన సంగీత విభావరి భక్తులను మైమరపింపజేసింది.

పీ4 నుంచి టీచర్లను మినహాయించాలి

గాండ్లపెంట: పేదలను ఉన్నతస్థాయికి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమం నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీ4లో భాగంగా పేదలను ఉపాధ్యాయులు తప్పనిసరిగా దత్తత తీసుకుని మార్గదర్శకులుగా నమోదు చేసుకోవాలని బలవంతం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సంపన్న కుటుంబాల వారు పేదలను దత్తత తీసుకోవడం చూశాం కానీ.. జీతం మీద ఆధారపడిన ఉద్యోగులకు అంతస్థాయి ఎక్కడిదని ప్రశ్నించారు. ఈ పథకం నుంచి ఉపాధ్యాయులను మినహాయింపు ఇవ్వాలని, లేని పక్షంలో కార్యక్రమాన్ని బహిష్కరించి ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

రైతు ద్రోహి చంద్రబాబు

- అన్నదాతలను ఆదుకోవడంలో విఫలం
- పుట్టపర్తి పవిత్రతను నీరుగార్చిన 'పల్లె'
- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధ్వజం



పెడపల్లిలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



రెడ్డిపల్లిలో పార్టీ శ్రేణులతో కలిసి 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ' ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు ద్రోహి అని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ధ్వజమెత్తారు. నల్లమాడ మండలం రెడ్డిపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులన్నా, వారి సమస్యలన్నా చంద్రబాబుకు ఏమాత్రమూ పట్టవన్నారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల్లో విపరీతంగా ప్రచారం చేసి అధికారంలోకి వచ్చాక పథకాలు అమలు చేయకుండా ప్రజలను వంచించారని మండిపడ్డారు. గత ఖరీఫ్‌లో అన్నదాత సుఖీభవ సాయం ఎగ్గొట్టారని, ప్రస్తుత ఖరీఫ్‌లో సీజన్ వెళ్లిపోతున్నా నేటికీ రైతులకు సాయం అందించలేదని విమర్శించారు. ఉచిత గ్యాస్, తల్లికి వందనం పథకాలను నామమాత్రంగా అమలు చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు యువతకు ఒక్కొక్కరికి నిరుద్యోగ భృతి రూ.42 వేలు, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన మహిళలకు ఒక్కొక్కరికి రూ.21 వేల చొప్పున బకాయిలు పడిందని చెప్పారు. వర్షాలు సరిగా కురవకపోవడం, సకాలంలో పెట్టుబడి సాయం అందకపోవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 50 వేల ఎకరాల విస్తీర్ణానికి వేరుశనగ పడిపోయిందన్నారు. గ్రామ గ్రామానా బెల్టు షాపులు పెట్టించి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం తప్ప మరో పని లేదన్నారు. తన సినిమాకు టికెట్ రేట్లు పెంచుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై లేదని మండిపడ్డారు. భగవాన్ సత్యసాయి బాబా నడయాడిన పుట్టపర్తి పవిత్రతను మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి నీరుగారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పుట్టపర్తిలో మద్యం, గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా లభిస్తున్నాయని, వాటికి బానిసలై యువత పెడదోవ పడుతోందని అన్నారు. పుట్టపర్తి ప్రాంతం పేకాట కేంద్రంగా మార్చడం పాలకులకు సిగ్గుచేటన్నారు. ముడుపులకు ఆశపడి అధికార టీడీపీ నాయకులే ముందుండి పేకాట ఆడిస్తున్నారన్నారు. ఇక నల్లమాడ మండలంలో పేకాట ఆడించేందుకు టీడీపీ నాయకులు పోటీ పడటం హేయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు కె.రవిచంద్రారెడ్డి, ఉంట్ల లక్ష్మీపతిరెడ్డి, ఎం.జగన్మోహన్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఆసాది గంగిశెట్టి, సహకార సంఘం మాజీ అధ్యక్షులు ఎ.గంగిరెడ్డి, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ రఘునాథరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, అశ్వర్థనారాయణ, మండల ఉపాధ్యక్షులు కె.సూర్యనారాయణ, విజయభాస్కర్ రెడ్డి, రెడ్డెప్ప, సీతారాం, యర్ర సూరి, సర్పంచ్‌లు ప్రసాద్, కుళ్లాయప్ప, బొజ్జేనాయక్, ఆనంద్‌నాయక్, నాగరాజునాయుడు, ఉప సర్పంచ్ గంగిరెడ్డి, మాజీ సర్పంచ్ రవిచంద్రారెడ్డి, ఎస్సీ,ఎస్టీ, మహిళ, యూత్, మైనార్టీ విభాగాల మండల అధ్యక్షులు ఆసాది శంకర, రాజేంద్రనాయక్, జయమ్మ, హరినాథరెడ్డి, సలీం, ఓబిరెడ్డి, బాబావలి, వెంకటేష్‌నాయక్, డీలర్ గంగిరెడ్డి, లక్ష్మినారాయణ, బయపరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చక్రి తదితరులు పాల్గొన్నారు.

నయవంచక పాలన

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రంలో నారా చంద్రబాబు సారథ్యంలో నయవంచక పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం పుట్టపర్తి మండలం పెడపల్లిలోని ఎంపీపీ ఏవి రమణారెడ్డి స్వగృహంలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుద్దుకుంట మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను వంచించడమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. కూటమి మేనిఫెస్టో ఒక అబద్ధాల కరపత్రంగా అభివర్ణించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగ్లీబాయి, కోఆప్షన్ సభ్యులు మాబుసాహెబ్, మాజీ సర్పంచ్ చిత్తరంజన్‌రెడ్డి, మండల, పట్టణ కన్వీనర్లు ఈశ్వరయ్య, రవి నాయక్, మాజీ కన్వీనర్ నరసారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీల, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, మోహన్‌నాయక్, అంజి నాయక్, తిరుపాల్‌నాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి



పెద్దిరెడ్డితో తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

తాడిమర్రి: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసిన నేపథ్యంలో మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని స్వగృహంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం కలిసి పరామర్శించారు. కూటమి ప్రభుత్వ నిరంకుశ చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అడ్వకేట్ పేరూరు కురుబ నాగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జొల్లిరెడ్డి అశ్వత్థ తదితరులు పాల్గొన్నారు.

పనుల నాణ్యతపై ఆరా

గాండ్లపెంట: ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనుల్లో నాణ్యత- ప్రయోజనాలపై కేంద్ర బృందం సభ్యుడు దయాకర్‌రెడ్డి ఆరా తీశారు. సోమవారం గాండ్లపెంట మండలంలోని సామాలగొంది‌లో పర్యటించి ఉపాధి హామీ కింద చేపట్టిన ఫారంపాండ్, చెరువులో పూడికతీత, పండ్లమొక్కల పెంపకం, సీసీ రోడ్డు తదితర పనులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్ శివప్పనాయుడు ఆధ్వర్యంలో పింఛన్‌దారులు, గృహ లబ్ధిదారులు, ఉపాధిహామీ కూలీలతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం అక్కడి నుంచి ఎన్‌పీ కుంట మండలంలో చేపట్టిన వాటర్‌షెడ్ పనులను పరిశీలించి వాటర్‌షెడ్‌తో రైతులు ఎంత వరకు లబ్ధిపొందారో తెలుసుకున్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయ్‌ప్రసాద్, ఏపీడీ రమేష్‌బాబు, ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, జేఈ రెడ్డిశివప్రసాద్, ఉపాధిహామీ, హౌసింగ్ , వెలుగు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: మండలంలోని కొండక్రిందతండాలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తొలిసేనాయక్ (65) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సోమవారం తండాకు వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డుంగావత్ రమేష్‌నాయక్, మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, సర్పంచ్‌లు పార్వతమ్మ, మంగేనాయక్, బొజ్జేనాయక్, నాయకులు టీడీ విజయభాస్కర్‌రెడ్డి, సీతారాం, హరి తదితరులు ఉన్నారు. అలాగే ఎద్దులవాండ్లపల్లికి చెందిన అక్కులప్ప (40), ఓబుళప్ప (54) ఇటీవల చనిపోయారు. వారి కుటుంబాలను దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం

ప్రయాణ సమయంలో జాగ్రత్తలపై అవగాహన

బత్తలపల్లి: ప్రయాణ సమయంలో విలువైన వస్తువులు అపహరణకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. సోమవారం బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్ ఆదేశాల మేరకు ఏఎస్‌ఐ సోమశేఖర్‌మూర్తి ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు, కానిస్టేబుల్ లింగమయ్య, నాగార్జున, అనిల్‌కుమార్, జనార్దన్ తదితరులు బస్సుల కోసం వేచి చూస్తున్న మహిళలు, ప్రయాణికులు తమ బ్యాగులలో ఉంచుకున్న విలువైన వస్తువులు, సెల్ ఫోన్ తదితర వాటిని అపరిచిత వ్యక్తుల నుంచి ఎలా కాపాడుకోవాలో తెలియజేశారు. మహిళలు, విద్యార్థినులు బస్సులు, ఆటోలలో ప్రయాణించేటప్పుడు ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించి రక్షణ పొందాలని సూచించారు.

పేకాట స్థావరంపై దాడులు

బత్తలపల్లి: గరిశలపల్లి సమీపంలోని చిత్రావతి నది వద్ద పేకాట స్థావరంపై సోమవారం ఎస్‌ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో మెరుపు దాడులు నిర్వహించారు. డి.చెర్లోపల్లికి చెందిన మేడసారి ఆంజనేయులు అనే వ్యక్తి పట్టుబడగా మిగిలిన తొమ్మిది మంది పేకాటరాయుళ్లు పారిపోయారు. పట్టుబడిన వ్యక్తి నుంచి రూ.9,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

20 మంది దత్తత

పుట్టపర్తి అర్బన్: పెడపల్లిలో సోమవారం పీ4పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ నిరుపేదలను దత్తత తీసుకొని వారి ఉన్నతికి పాటుపడాలని సూచించారు. ఇందుకు మాజీ జెడ్పీటీసీ శ్రీరాంనాయక్ ముందుకు వచ్చి 15 మంది పేదలను, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి ఐదుగురు పేదలను దత్తతకు తీసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగ్లీబాయి, సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఎంఈఓ ఖాదర్‌వలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

అధిక వడ్డీలపై ఫిర్యాదు చేస్తే చర్యలు

ధర్మవరం: పట్టణంలో అధిక వడ్డీలు వసూలు చేసే వారి ఆగడాల గురించి ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాల్ మనీ ద్వారా ఇబ్బందులు పడుతున్న వారు ఫిర్యాదులు చేస్తే అధిక వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 23న శాంతినగర్‌కు చెందిన రమణపై వడ్డీవ్యాపారులు దాడిచేశారని, ఈ ఘటనలో ఏడుగురిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

ఒకే ఈతలో రెండు దూడలు



పుట్టపర్తి టౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి శిల్పారామం గుట్ట మీద నివాసముంటున్న పాడి రైతు శ్రీనివాసులు పెంచుతున్న పాడిఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. ఇందులో ఒకటి మగ, ఇంకొకటి ఆడ దూడ. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో రైతు ఇంటి వద్దకు చేరుకుని దూడలను ఆసక్తిగా గమనించారు. ఆరోగ్యంగా పుట్టిన దూడలను ముద్దాడుతూ తల్లి ప్రేమను చాటుతున్న ఆవును చూసి మురిసిపోయారు.

నాణ్యతతో పనులు చేయండి

బత్తలపల్లి: అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని ఎంపీడీఓ నరసింహనాయుడు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో మండల పరిషత్, పంచాయతీ గ్రాంట్లతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను ఈఓఆర్డీ క్రిష్టప్ప, పరిపాలన అధికారి శ్రీనివాసులు, తాడిమర్రి ఈఓఆర్డీ రాజశేఖర్ నాయుడు తదితరులతో కలిసి ఎంపీడీఓ పర్యవేక్షించారు. కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి పక్కన దారికి అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాన్ని తొలగించేలా చూడాలని కాలనీవాసులు కోరారు.

పథకాల అమలులో అట్టర్‌ఫ్లాప్



కొక్కంటిక్రాస్‌లో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న తనకల్లు మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి



గాండ్లపెంట మండలం తుమ్మలబైలులో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తనకల్లు: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి విమర్శించారు. తనకల్లు మండలం కొక్కంటిక్రాస్ సీబీ కాలనీలో సోమవారం 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా చంద్రబాబు చేసిన మోసాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం బాబు మోసాలకు సంబంధించి క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణమ్మ, మహిళా కన్వీనర్ విజయలక్ష్మీ, మాజీ సర్పంచ్ పూల నిర్మల, మాజీ అగ్రీ బోర్డు చైర్మన్ కొండా మల్లికార్జున, ఉపాధ్యక్షుడు ముస్తఫా, నాయకులు సంజీవరెడ్డి, నరేంద్ర, పూల శంకర్, గౌస్, అబ్దుల్ రసూల్, కొండ్ల సుధాకర్, ఇక్బాల్, సూరి, ఖాదర్‌వలి, కుళ్లాయప్ప, బాబ్జాన్, రమణ, షాబీర్, అమీర్, చంద్ర, బయారెడ్డి, షబ్బీర్, విశ్వనాథ్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రమణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, హనీఫ్, ప్రకాష్, రాజారెడ్డి, జగదీష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: గొడ్డువెలగల పంచాయతీ జీడిమేకలపల్లి, తుమ్మలబైలు పెద్దతండా, తుమ్మలబైలు, కటారుపల్లి గ్రామాల్లో సోమవారం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా క్యూఆర్ కోడ్‌ను వైఎస్సార్‌సీపీ గాండ్లపెంట మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గొడ్డువెలగల ఆంజనేయులు, తుమ్మలబైలు సర్పంచ్ అబ్బా ఆంజనేయులు, నాయకులు మాజీ ఎంపీపీ తాతం జగన్మోహన్, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, నాయకులు గోపాల్‌నాయక్, పామిడి ఇక్బాల్, వైస్ కన్వీనర్‌లు ఖాజావలి, ఆసిఫ్, మండల కార్యదర్శులు ఫయాజ్, గోవిందరెడ్డి, బూత్ కన్వీనర్లు బాబ్జాన్, ఆంజనేయులు, రాజన్న, వెంకటరమణారెడ్డి, రామప్ప, దామోదర, చాంద్‌బాషా, వద్దిరెడ్డి కృష్ణారెడ్డి, రామక్రిష్ణ, అశోక్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, చంద్ర, హరినాథ్, వార్డు సభ్యులు మహబుబ్‌బాషా, ప్రభాకర్‌రెడ్డి, నజీర్, వలి, అన్వర్‌బాషా, యోగానందరెడ్డి, శ్రీరామునాయక్, గోవర్ధన్‌నాయక్, అజయ్‌కుమార్ నాయక్, హనుమంతునాయక్, ప్రసాద్‌నాయక్, గిరిబాబు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బూటకపు హామీలు వివరిద్దాం

గాండ్లపెంట: కూటమి నేతలు ఇచ్చిన బూటకపు హామీలు, వారు చేసిన వంచన గురించి ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలని వైఎస్సార్‌సీపీ ఎన్‌పీ కుంట మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎన్‌పీకుంట మండలం వెలిచలమల, గూటిబైలు, పడమర నడిమిపల్లి, ఎదురుదోన గ్రామాల్లో క్యూఆర్ కోడ్ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, ఉప సర్పంచ్ హిదాయతుల్లా, నబీసాబ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవిందునాయక్, మండల ప్రధాన కార్యదర్శి దుద్దుకుంట వెంకటరెడ్డి, బోరెడ్డి నీలకంఠారెడ్డి, నీలం చంద్రమోహన్‌రెడ్డి, ఎద్దుల కేశవ, ఆదెప్పనాయుడు, గోపాల్‌రెడ్డి, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ కేఎస్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, అల్లాబకాష్, ప్రశాంత్, రంగారెడ్డి పాల్గొన్నారు.

నోటిఫికేషన్‌లో నిబంధనల మార్పులకు వినతి

తాడిమర్రి: సమగ్ర శిక్షలో నాలుగు సెక్టోరియల్, ఐదు అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల నియామకానికి సోమవారం విడుదలైన నోటిఫికేషన్‌లో స్వల్ప మార్పులు చేయాలని కొందరు ఉపాధ్యాయులు సోమవారం ప్రభుత్వానికి విన్నవించారు. డిప్యుటేషన్ పద్ధతిలో (ఫారిన్ సర్వీస్ కింద) అర్హులైనటు వంటి అన్ని సబ్జెక్ట్‌లకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీల నుంచి దరఖాస్తులు కోరారని తెలిపారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా జూలై 28 నాటికి ఐదు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేయాలన్న నిబంధన వల్ల 31 తేదీకి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న స్కూల్ అసిస్టెంట్లు, ఇతర ఉపాధ్యాయులు నష్టపోతారని తెలిపారు. సర్వీస్ నిబంధన గడువు 2025 ఆగస్టు 1 నాటికి ఉన్నత విద్యార్హతలతో పాటు ఆసక్తి ఉన్న ఎందరో ఉపాధ్యాయులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి ప్రకటించిన చివరి తేదీ ఆగస్టు 4 కాకుండా మరికొంత కాలం పొడిగించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం



భిక్షాటన చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

తాడిమర్రి: ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పోరాడుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ బీసాని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సీపీఐ మండల కమిటీ నాయకులు, అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ నాయకులు, కార్యకర్తలతో కలసి సోమవారం ఆమన ఎం.అగ్రహారంలో ఇంటింటా భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో అయినా పట్టణాల్లో అయినా ప్రజల పక్షాన నిలిచి ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో పోరాటాలు చేసే శక్తి ఒక్క సీపీఐకి మాత్రమే ఉందన్నారు. ఈ నెల 31, ఆగస్టు 1న రెండు రోజుల పాటు ధర్మవరంలో జరిగే రెండవ జిల్లాస్థాయి సమావేశాలకు రైతులు, మహిళలు, నిరుద్యోగులు, కార్మికులు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ కాటమయ్య, నాయకులు బీసాని నాగభూషణం, చిన్న పెద్దన్న, దాసు, గుర్రప్ప సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

31న సీపీఐ జిల్లా మహాసభలు

చెన్నేకొత్తపల్లి: ఈనెల 31న ధర్మవరంలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ముత్యాలప్ప మాట్లాడుతూ జిల్లా మహాసభలకు నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి రాము,రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మహదేవ్, కనగానపల్లి మండల రైతు సంఘం నాయకుడు కార్యదర్శి ఆదినారాయణ పాల్గొన్నారు.

కనగానపల్లి: ఈనెల 31వ తేదీన జరిగే సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్లను మండల నాయకులు సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మహదేవ, సీపీఐ నాయకులు మల్లికార్జున, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి చెందాలి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదిశక్తి సొసైటీ 28వ వార్షిక మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టింబక్టు కలెక్టివ్ సంస్థ వ్యవస్థాపకులు గంగూలీ, మేరీ వట్ట మట్టమ్ మాట్లాడుతూ.. మహిళలు పొదుపు సంఘాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సొసైటీ ద్వారా సహకారం అందించడం జరుగుతుందన్నారు. మహిళలకు నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించడంతో పాటు వారిలో చైతన్య తీసుకొస్తామని తెలిపారు. ఆదిశక్తి సొసైటీ సీఈఓ కవిత వార్షిక నివేదికను సభ్యులకు వివరించారు. అలాగే సొసైటీ చేపడుతున్న కార్యక్రమాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు అశ్వర్థమ్మ, సొసైటీ సీఈఓ కవిత పాల్గొన్నారు.

నాగమ్మ తల్లీ చల్లగ చూడమ్మా..



బత్తలపల్లిలో నాగులకట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



కదిరిలో నాగులకు పూజలు చేస్తున్న మహిళలు

బత్తలపల్లి: నాగమ్మ తల్లీ.. మాపై నీ చల్లని చూపులతో దయ చూపాలని పలువురు మహిళలు సోమవారం నాగులపుట్టలకు పూజలు నిర్వహించారు. మండలంలోని పోట్లమర్రి, గంటాపురం, రాఘవంపల్లి, మాల్యవంతం, వెంకటగారిపల్లి, గుమ్మల్లకుంట, అప్పరాచెరువు, ఉప్పర్లపల్లి, నల్ల బోయనపల్లి, కాటమకుంట, బత్తలపల్లి, రామాపురం, ఓబుళాపురం, సంగాల, వరదాపురం, జలాలపురం, గరిశలపల్లి, జ్వాలాపురం, తంబాపురం తదితర గ్రామాల మహిళలు సమీపంలోని నాగులకట్టలకు, నాగులపుట్టలకు పూజలు చేశారు. పుట్టల్లోకి పాలు పోసి జనులందరినీ చల్లంగ చూడమ్మా అంటూ మొక్కులు తీర్చుకున్నారు. ఉపవాస దీక్షలతో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పవిత్రమైన శ్రావణ మాసంలో వచ్చే ప్రతి దినం మంగళకరమేనని ఈ మాసం అంతా ఈ వేడుకలను నిర్వహించుకుంటున్నారు.

ఘనంగా నాగులచవితి వేడుకలు

కదిరి టౌన్: పట్టణంలో నాగలచవితి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్దనున్న నాగుల (పుట్ట)కు, ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉన్న నాగులకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలకు పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

కలెక్టరేట్ ముట్టడి భగ్నం దారుణం



పోలీస్‌స్టేషన్ బయట మాట్లాడుతున్న కుళ్లాయప్ప

ధర్మవరం అర్బన్: ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించతలపెట్టిన కలెక్టరేట్ ముట్టడికి వెళ్లకుండా అరెస్టు చేయడం దారుణమని ఎస్సీ జన సంఘం జాతీయ అధ్యక్షుడు కుళ్లాయప్ప, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్ అన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ ముట్టడి కోసం పుట్టపర్తికి బయల్దేరిన నాయకులను ధర్మవరం టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి, సాయంత్రం వదిలిపెట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ బయట నాయకులు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై పోరాడుతున్న నాయకులను అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే అవుతుందన్నారు. పేదలు, బలహీనవర్గాల కోసం తమ పోరాటం కొనసాగుతుందన్నారు.